క్లుప్తంగా

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

రోడ్డెక్కిన వ్యర్థాలతో అవస్థలు



లలితానగర్‌లో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మ్యాన్‌హోల్ వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు లలితానగర్‌లో సరోజ ఆస్పత్రి పక్కనున్న రోడ్డులో మ్యాన్‌హోల్ లీకై మలమూత్ర వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. ఇంటి ముందు నుంచి వ్యర్థాలు ప్రవహిస్తుండటంతో నివాసులు కాలు బయట పెట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం పండగ రోజున ఇంటి ముందు ఇంతంటి అపరిశుభ్ర పరిస్థితితో తీవ్ర అవస్థలు పడ్డామని తెలిపారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వివాహితకు ఆశ్రయం



జ్యోతిశ్రీని షెల్టర్ నిర్వాహకుడు వాసుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ గాయత్రి

అల్లిపురం: కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీ భర్త హింస భరించలేక ఇల్లు వదిలి విశాఖ చేరుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త రోజూ కొడుతుండటంతో ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లింది. జ్యోతిశ్రీ తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి అత్తవారి ఇంటికి పంపించారు. అత్తగారే చాడీలు చెబుతూ, కొడుకుతో కలిసి చిత్రహింసలు పెడుతుండటంతో ఆమె తట్టుకోలేక ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. ఒంటరిగా మహారాణిపేట రోడ్ల మీద తిరుగుతూ ఉండగా.. లేడీ కానిస్టేబుల్ గాయత్రి ఆమెను చూసి వివరాలు తెలుసుకుంది. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌కు జ్యోతిశ్రీని తీసుకెళ్లింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో జీవీఎంసీ మహిళల వసతి గృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈఎల్ పునరుద్ధరణకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అర్జిత సెలవులు (ఈఎల్) ఎన్‌క్యాష్‌మెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈఎల్ పై ఆధారపడి పిల్లల ఫీజులు చెల్లించుకునే వారని పేర్కొన్నారు. ఉద్యోగుల పరిస్థితి అర్థం చేసుకుని లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలన్నారు. అధికారులకు 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం ఉండగా కార్మికులకు 200 లీవులు మాత్రమే పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్మికులు లీవులు కోల్పోకుండా 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం కల్పించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ తదితరులు కోరారు.

తాగునీరు శుద్ధమేనా..?



సీతంపేటలో నిర్వహిస్తున్న బల్క్ ఆర్వో వాటర్ ప్లాంట్

- ఆర్వో వాటర్ పేరిట జోరుగా తాగునీటి వ్యాపారం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బల్క్ వాటర్ ప్లాంట్లు
- వందలాది క్యాన్‌లతో నీటి విక్రయాలు
- అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, ఫంక్షన్లకు పెద్ద ఎత్తున నీటి సరఫరా
- అనుమతులు, నాణ్యతా ప్రమాణాలపై కానరాని అధికారుల పర్యవేక్షణ



సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక నిల్వ చేసిన వాటర్ క్యాన్‌లు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో ఆర్వో వాటర్ పేరిట తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతి వార్డులో రెండు మూడు బల్క్ ఆర్వో వాటర్ ప్లాంట్లు కనిపిస్తున్నాయి. ఈ లెక్కన నియోజకవర్గంలో 15 నుంచి 20 వరకు వాటర్ ప్లాంట్లు, బల్క్ విక్రయ కేంద్రాలు ఉన్నట్టు తెలుస్తోంది. మున్సిపల్ వాటర్, బోరు నీటిని ఆర్వో ద్వారా ఫిల్టర్ చేసి క్యాన్‌ల్లో లీటర్ల చొప్పున విక్రయిస్తున్నారు. కంపెనీ వాటర్ క్యాన్‌ల ధర ఎక్కువగా ఉండటంతో తక్కువ ధరకు లభించే ఆర్వో వాటర్ కొనుగోలుపై జనం మొగ్గుచూపుతున్నారు. ఇదే అదనుగా పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. వాటి ఏర్పాటుకు అనుమతులు, తాగి నీటిలో పాటించాల్సిన ప్రమాణాలు ఉన్నాయా లేదా, శుద్ధ జలమే విక్రయిస్తున్నారా అని ఎవరూ పట్టించుకోవడం లేదు.

నిబంధనలు పాటిస్తున్నారా?

వాస్తవంగా ఎవరైనా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలంటే ముందుగా ఆ ప్రాంతంలో స్థల పరిశీలన జరగాలి. భూగర్భ జలాలు ఏ స్థాయిలో ఉన్నాయి, నీటిలో సున్నం, మినరల్స్ ఏ స్థాయిలో ఉన్నాయి వంటివి ఫుడ్ సేఫ్టీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. నగర పరిధిలో జీవీఎంసీ అనుమతి తప్పనిసరి. లైసెన్స్ పొంది ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరించే ఐఎస్ఐ మార్కు తప్పనిసరి. వాటర్ ప్లాంట్‌కు ఐఎస్ఐ మార్కు రావాలంటే నీటి పరీక్షలు చేసిన నివేదికలు ప్రభుత్వానికి అందజేయాలి. దీనికి ఖర్చు కూడా అధికమే. నాణ్యత ప్రమాణాల్లో ఏ మాత్రం రాజీపడినా ఐఎస్ఐ ధ్రువీకరణ తిరస్కరించబడుతుంది. చాలా మంది వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా నీటిని క్యాన్‌ల్లో విక్రయిస్తున్నారు. వార్డుల్లోని వీధుల్లో చిన్న చిన్న గదుల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను ఇష్టానుసారంగా వాడుకుంటూ వ్యాపారం చేస్తున్నారు.



ఆటోలో విక్రయానికి తరలిస్తున్న అపరిశుభ్రంగా ఉన్న వాటర్ క్యాన్‌లు



గ్లౌజులు లేకుండా క్యాన్‌లో నీటిని నింపుతున్న ప్లాంట్ సిబ్బంది

కమర్షియల్ ప్లాంట్ల కోసం..

కమర్షియల్‌గా ఆర్వో ప్లాంట్ ద్వారా నీటి విక్రయాలకు ఎంఎస్ఎంఈ కింద వ్యాపార సంస్థ నమోదు అవ్వాలి. నాణ్యత ప్రమాణాల కింద బీఐఎస్ ఐఎస్ఐ ధ్రువీకరణ, ఆహార గ్రేడ్ భద్రత సమ్మతిని నిర్ధారించడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ తప్పకుండా అవసరం. స్థానిక మున్సిపల్ అథారిటీ నుంచి వాణిజ్య లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి ఎన్‌వోసీ, పర్యావరణ రక్షణ నియమాలు పాటించాలి. పరిశుభ్రత, నీటి నాణ్యత ల్యాబ్ పరీక్షలు, పెస్ట్ కంట్రోల్, వర్కర్స్ హెల్త్ సర్టిఫికెట్లు, ఎలక్ట్రికల్ లోడ్ మంజూరు అవసరం.

అధికారులు దృష్టి సారించాలి

నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో చిన్న ఇరుకు గదుల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి క్యాన్‌ల్లో నీరు నింపి విక్రయిస్తున్నారు. అనుమతులు, నాణ్యతకు సంబంధించిన ధ్రువపత్రాలు ఎక్కడా ప్లాంట్‌లో ప్రదర్శించడం లేదు. కనీసం సంబంధిత అధికారులు సైతం ఆర్వో ప్లాంట్ అనుమతులు ఉన్నాయా.. లేదా, శుద్ధత, స్వచ్ఛత ప్రమాణాలు పాటిస్తున్నారా అని తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో ఆర్వో నీటి వ్యాపారం అడ్డు లేకుండా సాగుతోంది. జీవీఎంసీ, ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించి ఆర్వో ప్లాంట్‌ల అనుమతులు, నీటి నాణ్యతను ధ్రువీకరించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

శుద్ధి చేసిన నీటి నాణ్యతా ప్రమాణాలు..



ఆర్వో ద్వారా శుద్ధి చేసిన తాగునీరు తప్పనిసరిగా ఐఎస్ 10500:2012 లక్షణాలకు అనుగుణంగా ఉండాలి. పీహెచ్ 6.5 నుంచి 8.5, టీడీఎస్ కాఠిన్యం నిబంధనల మేరకు ఉండాలి. ఫ్లోరైడ్ 1.0 ఎజీ/లీటర్, నైట్రేట్ 45 ఎంజీ/లీ, ఆర్సెనిక్ 0.01 ఎంజీ/లీ, సూక్ష్మజీవులు నిల్‌గా ఉండాలి. ఇన్ని అనుమతులు, నాణ్యత ప్రమాణాలు కావాల్సి ఉండగా.. ఏయే అనుమతులతో ఆర్వో ప్లాంటు నిర్వహిస్తున్నారో తెలియడం లేదు.



అక్కయ్యపాలెం సరోజ ఆస్పత్రి వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, ఉదయం 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

పంచామృతాభిషేకం రేపు

శుద్ధ పౌర్ణమి హయగ్రీవ జయంతి సందర్భంగా ఆదివారం వైభవ వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి నిజరూప దర్శనం ఉంటుంది. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన చేస్తారు. మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు.

డాక్‌యార్డ్ కేటీబీ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాఖ విద్య: డాక్‌యార్డ్ కేటీబీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గంట్ల శ్రీనుబాబు, అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల చిరంజీవి, విజనగిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరోతి వెంకటేష్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా యాతము రాజ్ కుమార్, కోశాధికారిగా గనిరెడ్డి శ్రీనివాస్‌తో కలిపి మొత్తం 27 మంది నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్‌లోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తొలిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, చిరంజీవి మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవ చేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరూ పూర్వ జన్మసుకృతంగా భావించాలన్నారు. అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి (సభ్యుల) తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. పలువురి సీనియర్లను సలహాదారులుగా, కొందరు న్యాయవాదులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులంతా అభినందనలు తెలియజేశారు.

ఆత్మీయానురాగాల రక్షా బంధన్



గొల్ల కంచరపాలెంలో రాఖీలు తయారు చేస్తున్న బాలికలు

కంచరపాలెం: రక్షా బంధన్ వేడుకను పురస్కరించుకుని గొల్ల కంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు రాఖీల తయారీలో శిక్షణ ఇచ్చారు. సహజ సిద్ధంగా దొరికే సామగ్రితో రాఖీలు తయారు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆత్మీయానురాగాలకు చిహ్నమైన రాఖీ పండగ విశిష్టతను తెలిపేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు సమ్మి జ్యోతిబాబు చెప్పారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, మాన్విత, జశ్వంత్, ఎస్.తేజ, పి.లావణ్యలక్ష్మి, సాద్విక్, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు

సీతంపేట: రాఖీ పండగకు అక్కచెల్లెమ్మలు సిద్ధమయ్యారు. శనివారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మార్కెట్‌లో శుక్రవారం రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి. అక్కయ్యపాలెం, సీతంపేట, శంకరమఠం రోడ్డు, సీతమ్మధార, రామాటాకీస్, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన మోడళ్లలో రాఖీలు విక్రయిస్తున్నారు. అన్నదమ్ముల ఆశీర్వచనాలు అందుకునేందుకు చిన్నారులు, యువతులు, మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కొనుగోలు చేశారు. రాఖీ దుకాణాలతోపాటు స్వీట్ షాపులు కళకళలాడాయి. మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో రాఖీల స్టాల్

ఎట్టకేలకు శ్రీనగర్ రోడ్డుకు మోక్షం

సీతంపేట: జీవీఎంసీ 27వ వార్డులోని వీటీ హైస్కూల్ సమీపంలో శ్రీనగర్ రోడ్డును ఎట్టకేలకు పునర్నిర్మిస్తున్నారు. రామాటాకీస్ రహదారి నుంచి ద్వారకానగర్‌కు వెళ్లే శ్రీనగర్ రోడ్డు గోతులతో రాళ్లు తేలి అధ్వానంగా మారింది. చాలా కాలంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో రహదారులను బాగు చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. శ్రీనగర్ రోడ్డులో జనం పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయ్యాక ఈ రహదారికి మోక్షం కలిగింది. రెండు రోజులుగా శ్రీనగర్ రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీనగర్ రోడ్డు పునర్నిర్మాణ పనులు

ఉత్సాహంగా ఏయూ ఉద్యోగుల క్రికెట్ పోటీలు

మద్దిలపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులకు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు నాలుగు జట్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. సీఏవో-1 జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆ టీం ప్లేయర్ గోవింద అత్యధికంగా 44 పరుగులు సాధించారు. శనివారం జరిగే పోటీల్లో 6 జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు వెంకటాద్రి, సిద్ధయ్య హాజరు కానున్నారు. పోటీల నిర్వాహకులుగా దువ్వి గోవింద, డి.శ్రీనివాసరావు, కోనా పోలారావు, కర్రి శ్రీనివాస్ వ్యవహరించారు. ఖాదర్‌బాబా, ఈశ్వరరావులు ఆసక్తికరమైన వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను రక్తికట్టించారు.



సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న సీఏవో జట్టు

బ్రహ్మకుమారీస్ కేంద్రం ప్రారంభం

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ప్రారంభించారు. మెడిటేషన్ సెటర్ ఈ ప్రాంతంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆయనకు రాఖీకట్టారు. కార్యక్రమంలో శరగడం సురేష్, బొడ్డేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ వెంకటరమేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

వర ప్రదాయినీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- విశేష అలంకారాల్లో శ్రావణలక్ష్మి దర్శనం

సీతంపేట: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా సౌభాగ్యం, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మీ వ్రతాన్ని ఉత్తర నియోజకవర్గంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో లలితాదేవి అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలోని పద్మావతి అమ్మవారిని గాజులతో చూడముచ్చటగా అలంకరించారు. ఉదయం మహిళలు వ్రతం చేసుకుని సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం పీఠంలో నిర్వహించిన విశేష అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ రామచంద్రానగర్ మహాలక్ష్మి సహిత శివసాయి ఆలయంలో కొలువైన మహాలక్ష్మికి విశేష పూజలు చేశారు. పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆలయ అర్చకులు దూప, దీప, నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. మహిళలు లలితా సహస్ర నామం పఠించారు.

➡ స్థానిక పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితాదేవికి భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కుంకుమ పూజలు, గులాబి పూలతో అర్చన, ఆరాధన జరిపారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.



రామచంద్రానగర్ మహాలక్ష్మి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



మురళీనగర్ రామాలయంలో పూజలందుకున్న లలితాంబిక



లలితా పీఠంలో గాజులతో అలంకరించిన పద్మావతి



పీఠంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



లలితా పీఠంలో బారులు తీరిన భక్తులు

తుంగభద్ర వారియర్స్ జెర్సీ ఆవిష్కరణ



కొత్త జెర్సీతో తుంగభద్ర వారియర్స్ జట్టు సభ్యులు

డాబాగార్డెన్స్: ఏపీఎల్ సీజన్-4లో ఆడనున్న 'తుంగభద్ర వారియర్స్' క్రికెట్ టీం జెర్సీని శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగభద్ర వారియర్స్ ప్రతినిధి శేషుకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర టీం అనేది ఏపీఎల్‌లో ఆడే ఓ జట్టని, శేషుకుమార్, సిద్ధార్థ మురకొండ లీడ్ చేస్తున్నారని, స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ టీం ఆడుతుందన్నారు. ఈ నెల 23 వరకు 7 టీమ్‌లతో ఆడనుందని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ ఏజీ ప్రదీప్, కెప్టెన్ మహీప్‌కుమార్, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.